# కుక్క చావు

శ్యామలరావు గారు ఉత్తరాంధ్రలో రెండు జిల్లాల్లో తమ శాఖకు ఉన్నతాధికారి. ఆయన పచ్చ సంతకం మీద ఎందరో ఉద్యోగస్తుల,కాంట్రాక్టర్ల జీతాలు, జీవితాలు ఆధారపడి ఉన్నాయి. సుమారు పాతిక లక్షలరూపాయలు శాంక్షనై-ఏప్రిల్ 1వ తేదీకి – వివిధ తాలూకా కేంద్రాలకు విడుదల కావాలి. మరొక ఇరవైలక్షలు వివిధ కాంట్రాక్టర్లుకు అందాలి.

మార్చి 30వ తేదీన ఉదయం ఎన్నిమిదిన్నరకే వచ్చారు. శ్యామలరావు గారు ఆఫీసుకు. ఎన్ని సంతకాలు పెట్టినా ఫైళ్ల తరక్కుండా వున్నాయి. ప్రొసీడింగ్స్, బిల్సు, చెక్కులూ.... గుట్టలు గుట్టలుగా వున్నాయి.

ఇంతలో ఇంటి దగ్గర్నించి శ్యామలరావు గారి పెద్దబ్బాయి గాభరాగా ఫోన్ చేశాడు.

“రోజీకి పాము కరిచింది”

“రోజీకీ పాము కరిచిందా– అయ్యో–” అనుకుంటూ గాభరాగా ఎక్కడ ఫైళ్లు అక్కడే వదిలేసి హుటా హుటీన జీపులో యింటికి వెళ్లారు. ఇంటిదగ్గర రోజీ రొప్పుతోంది. –ఎగశ్వాస– నురగలు కక్కుతోంది–

రోజీ అంటే శ్యామలరావుగారికి పంచప్రాణాలూను. ఆయనతో పాటూ పిఏ గారూ, ఒక ప్రముఖ కాంట్రాక్టరూ వెంటవున్నారు. రోజీని జీపులో వేసుకుని ఆగమేఘాలమీద ఆస్పత్రికి పరుగులు తీశారు– అదే పశువుల ఆస్పత్రికి. రోజీ అంటే శ్యామలరావుగారి పెంపుడు కుక్క.

మరోపక్క పాము మంత్రగాళ్లకు కబురు వెళ్లింది. నిలబడ్డ పాటున జీపులో పడేసిలాక్కు రమ్మని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంటి పరిసరాల్లో– కాదు బంగళా పరిసరాల్లో వున్నతుప్పలన్నీ కొట్టేసి ‘క్లియర్’ చెయ్యమనికూడా ఆదేశాలు జారీ అయ్యాయి.

డాక్టరు పరిక్షించాడు “కోరలు బాగా లోతుకి దిగబడ్డాయి. విషం బాగా రక్తంలోకి ఎక్కిపోయింది. అయినా ప్రయత్నిద్దాం. ఐ ట్రయ్ మై లెవెల్ బెస్ట్” అన్నాడాయన. ఒక పవర్‌ఫుల్ ఇంజక్షనిచ్చాడు. ఆ పగలూ ఆ రాత్రీ ఎవ్వరికీ నిద్రలు లేవు. పి.ఏ. గారు వెంటాడినట్టు చెప్పగా– మరోపది ముఖ్యమైన ఫైళ్ల మీద సంతకాలు చేశారు. అమ్మయ్య! నాలుగు లక్షలు విడుదలయినట్టే!

మార్చి 31 తెల్లవారింది. క్షణ క్షణం టెన్షన్. డాక్టరిచ్చిన పవర్‌ఫుల్ ఇంజక్షన్‌వల్ల రోజీ మరో ఇరవై నాలుగ్గంటలు మాత్రం– కష్టం మీద– బతగ్గలిగింది. చివరికి మార్చి 31 మధ్యాహ్నం మూడు గంటలకి తుదిశ్వాస విడిచింది. శ్యామలరావు గారి యింటిల్లపాదీ ఒక ఆప్తుడైన మనిషి పోయినట్టు గోడు గోడున ఏడ్చారు. బెంగుళూరులో కొన్న కుక్క. ఇంట్లో వాళ్లని ఎన్నో సార్లు రక్షించిన కుక్క.

ఒకసారేం జరిగిందంటే – సరే... సరే... అదంతా ఇప్పుడొద్దు....

అంత్యక్రియలు బ్రహ్మాండంగా జరిగాయి. పూలతో అలంకరించిన కుక్క శవం వున్న జీపు వెంట శ్యామలరావు కుటుంబీకులేకాదు. ఆ డివిజన్‌లోని ముఖ్యమైన ఆఫీసర్లూ, కాంట్రాక్టర్లూ వెళ్లారు.

శ్యామలరావు గారు చాలా నిర్జీవంగా వున్నారు.

ఎవరు పిలిచినా పలక్కుండా వున్నారు.....

అంత్యక్రియలు ముగించి ఇల్లుచేరేసరికి రాత్రి పదకొండయి వుంటుంది.

ఫలితం– పదిహేనులక్షల రూపాయలు లాప్స్ అయిపోయారు.

ఆ తరవాత– శ్యామలరావు గారికి ఛార్జి మెమో రావడం, ఫలితంగా ఆదిలాబాద్ ట్రాన్సఫర్ కావడం జరిగాయి.

రెండు ఇంక్రిమెంట్లు కట్టవుతాయనీ, రివర్షన్ కూడా వచ్చే అవకాశంవుందనీ ఆయన వల్ల నష్టపోయిన వాళ్లు పుకార్లు లేవదీశారు. నిజంగా అవి నిజం అవుతాయేమోనని శ్యామలరావు గారు భయపడ్డారు. ఆ గొడవల్లోంచి బయట పడటానికి కుక్క పాట్లు పడవలసి వచ్చింది.

శ్యామలరావు గారి జీవితంలో అదొక విషాదఘట్టం.

కుక్కచావు కాదుగాని– అనేక మంది ఉద్యోగుల పని కుక్కచావే అయింది. ఎరియర్స్, టీఏబిల్స్ ఉండిపోయేయి. కొందరు కాంట్రాక్టర్ల చెక్కులు సంతకాలుకాక నష్టపోయేరు.

అంతపెద్ద ఆఫీసరుగారింట్లో కుక్క చచ్చిపోయిందంటే మాటలు కాదు.

*రచనా కాలం : 1976 (మిత్రులు 'భరాగో' గారికి కృతజ్ఞతల్తో)*
*ప్రచురణ : రాధమ్మమొగుడొచ్చాడు (కథాసంకలనం)– కల్పన బుక్స్, విజయవాడ*
*ప్రథమ ముద్రణ , జనవరి, 1977*